బీఆర్‌టీఎస్ శిథిలం


సంజయ్‌గాంధీ కాలనీ వద్ద గొయ్యిలా మారిన రోడ్డు భాగం

- అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ పనుల కోసం తవ్వేసిన రోడ్డు
- గిరి ప్రదక్షిణ భక్తులకు ఇబ్బందులే..!
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు


సింహగిరి కాలనీ ఎదురుగా రాళ్లు తేలిన సర్వీస్ రోడ్డు

ఆరిలోవ : బీఆర్‌టీఎస్ రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డుపై గోతులు పడడంతోపాటు, రాళ్లు తేలిన సర్వీస్ రోడ్డు, పిచ్చి మొక్కలతో నిండిన ఫుట్‌పాత్‌లతో అస్తవ్యస్తంగా మారింది. దీనికి తోడు అండర్ గ్రౌండ్ విద్యుత్ పనులతో చిందరవందరగా మారింది. ఈ రోడ్డు సాధారణంగా రోజూ రాకపోకలు జరుపుతున్న వాహనచోదకులకు అలవాటుగా మారింది. అయితే మరో మూడు రోజుల్లో జరగనున్న శ్రీవరాహ లక్ష్మీ నృసింహ స్వామి గిరి ప్రదక్షిణ భక్తులకు మాత్రం ఆటంకంగా మారనుంది. సింహాద్రి అప్పన్న కొండ చుట్టూ 32 కిలోమీటర్ల మేర తిరగాల్సిన గిరి ప్రదక్షిణ భక్తులకు సుమారు 9 కిలో మీటర్ల పొడవున బీఆర్‌టీఎస్ రోడ్డు ఎక్కువ భాగం ఇబ్బందిగా మారనుంది. హనుమంతవాక నుంచి అడవివరం వరకు సుమారు 9 కిలోమీటర్లు పొడవున ఐదు లైన్‌ల బీఆర్టీఎస్ (దారపాలెం నుంచి అడవివరం వరకు సుమారు కిలోమీటరు మేర మూడు లైన్‌లు) రహదారి విశాలంగా ఉండటంతో గిరి ప్రదక్షిణ భక్తులకు ఎప్పుడూ అనుకూలంగా ఉండేది.


ముడసర్లోవ వద్ద ఫుట్‌పాత్‌పై పిచ్చి మొక్కలు

మందకొడిగా విద్యుత్ పనులు

ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు ఈ రోడ్డుపై అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ పనులు చేపట్టడంతో ఈ సారి ఇబ్బందిగా మారనుంది. ఈ పనులలో భాగంగా బీఆర్టీఎస్‌లో అన్ని లైన్లలో తవ్వి విద్యుత్ కేబుళ్లు అమర్చుతున్నారు. ఈ పనులు మందకొడిగా సాగడంతో ఈ నెల 9న గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు ఇబ్బందిగా మారనుంది. ఇంకా ఈ పనులు కొనసాగుతున్నాయి. దీని కోసం తవ్విన గోతులు పూడ్చడం పూర్తి కాలేదు. పైనాపిల్‌కాలనీ, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, ముడసర్లోవ, చినగదిలి, పెదగదిలి వరకు సుమారు ఐదు కిలోమీటర్లు మేర మధ్య మధ్యలో గోతులు, ఇసుక దిబ్బలు ఉన్నాయి. గోతులు పడిన లైన్లలో గిరి ప్రదక్షిణ భక్తులు నడవడానికి అవస్థలు పడాల్సిందే. దీంతోపాటు బీఆర్‌టీఎస్‌కు ఇరుపక్కలా ఫుట్‌పాత్‌లపై పిచ్చి మొక్కలు మొలిశాయి. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది ఇంతవరకు ఆ పిచ్చి మొక్కలను కూడా తొలగించకుండా వదిలేశారు.


పెదగదిలి వద్ద గోతులు పడిన రోడ్డు

రాళ్లు తేలిన సర్వీస్ రోడ్డు

గిరి ప్రదక్షిణ భక్తులు బీఆర్టీఎస్‌లో అన్ని లైన్‌లలో నడుస్తుంటారు. పైనాపిల్‌కాలనీ నుంచి హనుమంతవాక వరకు సుమారు 7 కిలోమీటర్లకు పైగా బీఆర్‌టీఎస్‌కు ఇరుపక్కలా సర్వీస్ రోడ్లు ఉన్నాయి. దీనిలో ముడసర్లోవ చెరువు వైపు ఉన్న సర్వీస్ రోడ్డు పలుచోట్ల శిథిలమైంది. మధ్యమధ్యలో గోతులు పడడంతోపాటు కొన్నిచోట్ల రాళ్లు పైకి తేలిపోయాయి. ఇందులో పెదగదిలి కూడలి నుంచి హనుమంతవాక వద్ద విమ్స్ ద్వారం వరకు సర్వీస్ రోడ్డు రాళ్లు తేలిపోయి కంకర రోడ్డును తలపిస్తోంది. దీంతోపాటు మధ్యమధ్యలో గోతులుపడింది. వాహనచోదకులు ఈ సర్వీస్ రోడ్డుపై ఇబ్బంది పడుతున్నారు. సుమారు 10 నెలలుగా ఇక్కడ ఇదే పరిస్థితి ఉన్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోలేదు. దీనిపై ఎన్నిసార్లు స్థానిక ఎమ్మెల్యే, అధికారులకు వినతులు ఇచ్చినా ఫలితం కనిపించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 9న జరగనున్న గిరి ప్రదక్షిణను కూడా అధికారులు దృష్టిలో పెట్టుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. భక్తులు ఈ రోడ్డుపై నడవడానికి ఇబ్బంది పడతారని స్థానికులు అంటున్నారు. గిరి ప్రదక్షిణలో కొందరు భక్తులు కాళ్లకు చెప్పులు లేకుండా నడుస్తుంటారు. అలాంటి వారికి ఇక్కడ రాళ్లు తేలిన సర్వీస్ రోడ్డుతోపాటు అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనుల కోసం తవ్విన చోట చాలా ఇబ్బంది పడాల్సి ఉంటుందని అంటున్నారు. జీవీఎంసీ అధికారులు ఇంత వరకు ఈ రోడ్డును పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.


ముడసర్లోవ వద్ద అండర్ గ్రౌండ్ విద్యుత్ తీగలు అమర్చడానికి తవ్వి వదిలేసిన రోడ్డు


రామకృష్ణాపురం కూడలి వద్ద అండర్ గ్రౌండ్ విద్యుత్ తీగలు అమర్చడానికి తవ్వి వదిలేసిన రోడ్డు

ఆరిలోవలో నీటి సరఫరాకు రేపు అంతరాయం


కేర్ ఆస్పత్రి వద్ద మరమ్మతులకు గురైన పైప్ లైన్

ఆరిలోవ : జీవీఎంసీ జోన్ – 2 పరిధిలోని వార్డుల్లో ఈ నెల 7న నీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. ఇందుకు సంబంధించి మరమ్మతులు చేపట్టనున్నట్లు నీటి సరఫరా విభాగం అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం ఎదురుగా కేర్ ఆస్పత్రి పక్కన కొమ్మాది నుంచి సరఫరా జరిగే మెయిన్ లైన్ మరమ్మతులకు గురైందని తెలిపారు. అక్కడ సోమవారం మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. దీంతో జీవీఎంసీ 10, 11, 12వ వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. జీవీఎంసీ 10వ వార్డు పరిధి వెటర్నరీకాలనీ, ఇందిరానగర్, ఆదర్శనగర్, సుందర్ నగర్, రవీంద్రనగర్, ఎస్.ఐ.జి.నగర్, బి.ఎస్.ఆర్.నగర్, తోటగరువు, తదితర ప్రాంతాలతోపాటు 11వ వార్డు పరిధి కైలాసగస్, గాంధీనగర్, డ్రైవర్స్ కాలనీ, ముస్తఫాకాలనీ, బాలాజీనగర్, పాత ఆరిలోవ, పార్వతినగర్, టి.ఐ.సి.పాయింట్, వికలాంగుల కాలనీ, జీవీఎంసీ 12వ వార్డు పరిధి సుందరయ్య కాలనీ, నెహ్రూనగర్, హిందీ కాలేజీ ప్రాంతం, అంబేడ్కర్‌నగర్, సాలిపేట, పెదగదిలి, చినగదిలి, సంతపాలెం, రామలక్ష్మీపురం, నేతాజీనగర్, న్యూశాంతినగర్, తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. అవసరమైన ప్రాంతాలకు జీవీఎంసీ ట్యాంకర్లు ద్వారా నీరు సరఫరా చేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

ఎస్సీ యువతకు ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ శిక్షణ ప్రారంభం


శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సత్యపద్మ తదితరులు

ఎంవీపీ కాలనీ: ఎస్సీ కార్పొరేషన్, న్యాక్ (ఎన్ఏసీ) సంయుక్తంగా ఎస్సీ యువతకు ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ ట్రైనింగ్ ప్రోగ్రాంను ప్రారంభించారు. గాజువాక న్యాక్ ట్రైనింగ్ సెంటర్ వేదికగా శనివారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ శిక్షణ తరగతులను ప్రారంభించి అభ్యర్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. తొలుత 30 మందికి శిక్షణ అందిస్తున్నట్లు ఈ సందర్భంగా సత్యపద్మ వెల్లడించారు. కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ రవికుమార్, సిబ్బంది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో కార్బన్ ఉద్గారాల తగ్గుదల


విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న కేఎం రావు తదితరులు

ఎంవీపీ కాలనీ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కార్బన్ ఉద్గారాలు తగ్గించాలని ఏపీ స్టేట్ టెలికాం విభాగం విశ్రాంత అధికారి కేఎం రావు కోరారు. ఉషోదయ కూడలి దరి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో నేతృత్వంలో శనివారం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్బన్ ఉద్గారాలు తగ్గించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అందరూ మొక్కలు విరివిగా నాటాలని సూచించారు. రోజువారీ జీవనంలో పర్యావరణానికి హాని కలిగించని విధంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, పాఠశాల హెచ్‌వోడీ దుర్గా కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా


ఆర్టీసీ మద్దిలపాలెం డిపో గేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

మద్దిలపాలెం : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత రెండు రోజులుగా డిపోల గేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మద్దిలపాలెం డిపో వద్ద రెండో రోజు శనివారం మధ్యాహ్నం గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పడాల రమణ, రెడ్డిలు మాట్లాడుతూ ఆర్టీసీ త్వరలో ప్రవేశపెట్టే ఉచిత బస్సు సర్వీసుకు తగిన బస్సులు కొనుగోలు చేయడమే కాకుండా అవసరమయ్యే సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగుల డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు.

గతుకుల రహదారి


దెబ్బతిన్న రామ్‌నగర్ ప్రధాన రహదారి

ఏయూక్యాంపస్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు రామ్‌నగర్ ప్రధాన రహదారి దెబ్బతింది. గవర్నర్ బంగ్లా నుంచి రాఘవేంద్ర స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో లైన్స్ క్లబ్ కూడలి వద్ద రోడ్డు దెబ్బతిని, కాంక్రీట్ బయటకు వచ్చింది. ఈ మార్గంలో పలు ఆస్పత్రులున్నాయి. ప్రయాణికులు ఈ మార్గంలో గతుకులమయమైన రహదారితో ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

కోదండరామయ్య సేవలు నిరుపమానం

ఏయూకు రామనేని కోదండ రామయ్య భవనం బహూకరణ


కోదండ రామయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్

మద్దిలపాలెం : క్రీడా రంగానికి శ్రీరామనేని కోదండరామయ్య అందించిన సేవలు నిరుపమానమని పలువురు కొనియాడారు. ప్రముఖ వాలీబాల్ కోచ్ శ్రీరామనేని కోదండ రామయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీధర్, కుటుంబ సభ్యులు నిర్మించిన నూతన భవనాన్ని శనివారం ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అధికారికంగా బహూకరించారు. ఈ సందర్భంగా ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ కోదండరామయ్య ఔదార్యం, సహాయం చేసే గుణం ఎంతో ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా ఆయన కుమారుడు శ్రీధర్ విశ్వవిద్యాలయం క్రీడా విభాగానికి ఉపయుక్తంగా నిలిచే భవనాన్ని నిర్మించి అందించడం ఎంతో గర్వకారణమని కొనియాడారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ కోదండ రామయ్య అందించిన సేవలు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాయని గుర్తు చేశారు. వాలీబాల్ క్రీడలో మనకి ఒక ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని, ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. క్రీడా విభాగం సంచాలకులు ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ శ్రీరామనేని కోదండరామయ్య జీవిత ప్రస్థానం, క్రీడా రంగానికి ఆయన చేసిన సేవలను వివరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ క్రీడలతోపాటు మానవతా దృక్పథం కలిగిన మహోన్నత వ్యక్తిత్వం కోదండరామయ్య సొంతమన్నారు. కోదండరామయ్య కుమారుడు భవన దాత శ్రీధర్ మాట్లాడుతూ మూడు వందల మంది విద్యార్థులు కూర్చునే విధంగా సెమినార్ హాల్ నిర్మించి ఇచ్చామన్నారు. తన తండ్రి ఎక్కువ సమయం గడిపిన ఏయూ వాలీబాల్ మైదానం పక్కనే భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, విద్యా విభాగాధిపతి ఆచార్య షారేన్ రాజు, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసే వరకు పోరాటం



సీతమ్మధార ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

తాటిచెట్లపాలెం: అదానీ గ్రూప్, సెకీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను పగుల గొట్టాలని, అదానీ, సెకి సంస్థలతో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి.. నేడు అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో మూడు సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై రూ.15,487 కోట్ల భారం వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇంటి పన్నులు, నీటి చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాలను మరచి కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్లాది రూపాయల ప్రజల కష్టార్జితాన్ని దోచిపెట్టే విధానాలను అనుసరిస్తున్నాయని ఆరోపించారు. విద్యుత్ ఒప్పందాల రద్దు, పెంచిన కరెంట్ చార్జీల తగ్గించే వరకు కలిసొచ్చిన వామపక్షాలు, ఇతర పార్టీలతో కలిసి ప్రజలను ఐక్యం చేసి పోరాడతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే రెహమాన్, సహాయ కార్యదర్శులు కె.సత్యనారయణ, పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు సి.ఎన్.క్షేత్రపాల్, సత్యాంజనేయ, వనజాక్షి, ఆర్.శ్రీనివాస్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల పాల్గొన్నారు.

నేడు, రేపు కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : కిరండూల్ మార్గంలో నడిచే రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

ఈ నెల 6, 7వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం (58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్– కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

- ఈ నెల 6,7వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 6, 7వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం (18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో కోరాపుట్– కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

పూరీ రథయాత్ర స్పెషల్ రద్దు

రేక్ అందుబాటులో లేని కారణంగా విశాఖపట్నం–పూరీ–విశాఖపట్నం మధ్య నడిచే స్పెషల్ రైలును రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈనెల 6వ తేదీన విశాఖపట్నం–పూరీ(08313) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో ఈ నెల 7వ తేదీన పూరీలో బయల్దేరాల్సిన పూరీ–విశాఖపట్నం(08314) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

అఖిల భారత సమ్మె విజయవంతానికి పిలుపు

ఆరిలోవ : ఈ నెల 9న జరగనున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 10, 12 వార్డుల పరిధిలో సీపీఎం నాయకులు పారిశుధ్య కార్మికులతో కలిసి సమ్మెకు సంబంధించిన పోస్టర్లు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు కుమార్, శంకరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. అందరు కార్మికులు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పెరిగిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ కంపెనీలు కార్మికులకు నష్టం కలిగించే విధానాలకు వ్యతిరేకంగా సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

అనధికార విద్యుత్ కోతలతో అవస్థలు

ఆరిలోవ : ఆరిలోవ ప్రాంతంలో అనధికార విద్యుత్ కోతలతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వారంలో ఒకసారి నిర్వహణ పనుల పేరుతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా 5, 6 గంటలు నిలిపేస్తున్నారు. అది చాలదన్నట్లు అనధికారికంగా రోజూ ఏదోచోట గంటల తరబడి విద్యుత్ నిలిపేస్తున్నారు. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీని వల్ల స్థానికులు ఫ్యాన్‌లు తిరగక ఉక్కపోత, రాత్రివేళల్లో చీకటితోపాటు బోరు నీటి కోసం మోటార్లు వేయలేని పరిస్థితి నెలకొంది. శనివారం వేకువజామున 4 గంటల నుంచి ఉదయం 9.15 వరకు, సాయంత్రం 3.30 గంటల నుంచి 4.30 వరకు ఆరిలోవ ప్రాంతంలో కరెంట్ తీసేశారు. ఆ సమయాల్లో సుమారు ఆరు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బోరు నీటి కోసం మోటార్లు పనిచేయక ఇబ్బంది పడ్డామని స్థానికులు వాపోయారు. ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే పిల్లలకు, ఉద్యోగాలకు వెళ్లే కుటుంబ సభ్యుల కోసం క్యారేజీలు సిద్ధం చేయడానికి కొవ్వొత్తుల వెలుగులో వంట చేయాల్సి వచ్చిందని గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ విభాగం సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించడం లేదని అంటున్నారు. ఆరిలోవ ప్రాంతంలో తరుచూ ఇదే పరిస్థితి ఉంటోందని వాపోతున్నారు. ఓ పక్క అధికారికంగా, అనధికారికంగా కరెంట్ తీసేస్తున్నారని, మరో పక్క విద్యుత్ బిల్లులు మాత్రం వేల రూపాయల్లో పంపిస్తున్నారని విమర్శిస్తున్నారు.

విమ్స్‌లో ప్రారంభోత్సవాలు


విమ్స్‌లో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో ఆర్వో ప్లాంట్లు, లిఫ్ట్, తలసేమియా యూనిట్, సదరన్ సెంటర్ అందుబాటులోకి వచ్చాయి. వాటిని విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విమ్స్‌లో వైద్య సదుపాయాలు మెరుగుపరచడానికి కృషి చేస్తానన్నారు. కేజీహెచ్ కంటే విమ్స్‌లో రోగులకు వైద్య సేలు అందించడానికి ఎక్కువ అవకాశం ఉందన్నారు. విమ్స్‌ను మరింత విస్తరించడానికి కావాల్సినంత స్థలం ఉందన్నారు. దివీస్ సంస్థ ఆర్వో ప్లాంట్లను సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విమ్స్‌లో సదరన్ కేంద్రం, తలసేమియా యూనిట్ ఏర్పాటు శుభసూచికమన్నారు. సదరన్ కేంద్రం ద్వారా మొదటి విడతలో వారానికి ఒక క్యాంప్ నిర్వహిస్తారన్నారు. భవిష్యత్‌లో ఇక్కడ వారానికి రెండు క్యాంప్‌లు ఏర్పాటు చేస్తారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మద్దిల రామలక్ష్మి, కెల్ల సునీత, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, విమ్స్ డీడీ శ్రీనివాస్ కుమార్, దివీస్ ప్రతినిధులు, విమ్స్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : స్థానిక సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి ఆవిష్కరణలు చేయాలని డాక్టర్ వి.ఎస్.క్రిష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. ఆ ఆవిష్కరణలను వ్యాపారంగా మలచుకునే నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అనే కార్యక్రమాన్ని కళాశాలలో శనివారం నిర్వహించారు. యునిసెఫ్, ఏపీ సీసీఈ, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయబాబు మాట్లాడారు. నలుగురు విద్యార్థులు ఒక టీంగా వై.ఎఫ్.ఎస్.ఐ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వైఎఫ్ఎస్ఐ కో ఆర్డినేటర్లుగా బి.నాగేశ్వరరావు, డాక్టర్ బి.లక్ష్మి వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ జోనల్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.ఉమామహేశ్వరరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు విజయ ప్రతాప్, వి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

శాంతియుత ప్రపంచం నిర్మిద్దాం

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో శనివారం 'హింసాయుత ఘర్షణలకు ముగింపు పలికి శాంతియుత ప్రపంచ వ్యవస్థను నిర్మిద్దాం' అనే అంశంపై శనివారం చర్చా కార్యక్రమం జరిగింది. బీవీ ఫౌండేషన్, గాంధీ సెంటర్, యూఆర్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీవీఎఫ్ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు, శిశువులపై దాడులు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కె.రవి మాట్లాడు తూ కృత్రిమ మేధస్సుతో అభివృద్ధి చెందుతున్న ఆయుధాలు ప్రంచానికి ముప్పుగా మారుతున్నాయని హెచ్చరించారు. గురుద్వారా అధ్యక్షుడు డి.ఎస్.ఆనంద్, మాజీ డీఐజీ అత్తిలి సుధాకర్, ప్రొఫెసర్ పద్దయ్య పాల్గొన్నారు.

ముగిసిన సెయిలింగ్ శిక్షణ

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళం, తీర గస్తీ దళం సంయుక్త ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన ఓసియన్ సెయిలింగ్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. గత నెల 23 నుంచి భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ సర్కార్‌లోని వాటర్‌మెన్‌షిప్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇండియన్ కోస్ట్ గార్డ్‌కి చెందిన 13 మంది సెయిలర్స్ ఈ శిక్షణలో పాల్గొన్నారు. సముద్ర జలాల్లో ఆపత్కాల సమయంలోనూ, విపత్తుల్లో చిక్కుకున్న వారికి రక్షించేలా తర్ఫీదునిచ్చారు. దీంతో పాటుగా సుదీర్ఘ సముద్రయానానికి సిద్ధమయ్యేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసంతో పాటు మెళకువలు నేర్పించారు. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే కోస్ట్ గార్డ్ గోల్డెన్ జూబ్లీ మహా సముద్రయానానికి శిక్షణ తీసుకున్న వారిని సంసిద్ధులను చేసినట్లు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.

విరబూసిన బ్రహ్మ కమలాలు



మహారాణిపేట : నగరంలోని సీబీఎం కాంపౌండ్ సమీపంలో నివసిస్తున్న ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు డి.పుల్లారావు నివాసంలో బ్రహ్మ కమలం పువ్వులు విరబూశాయి. ఈ ఇంటిలో పూల కుండీలో బ్రహ్మ కమలం మొక్కకి శనివారం 21 పువ్వులు పూయడంతో ఆయన భార్య రాధారాణి ఆనందం వ్యక్తం చేశారు. ఒక మొక్కకి 21 పువ్వులు పూయడం చాలా అరుదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.